కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -174 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 06-07-2026 | సోమవారం | పేజీలు : 4

# ఏడాదిన్నరలో రెండు కారిడార్లు



- భూసేకరణపై సీఎం ఫోకస్
- రూ.5,750 కోట్ల మెగా ప్రాజెక్ట్
- డెయిరీ ఫామ్ పనులు జోరు
- ఆగస్టులో శామీర్‌పేట్ కారిడార్
- రక్షణ భూముల సేకరణ వేగం
- ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం
- ఓఆర్ఆర్ వరకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణం

**న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్):** హైదరాబాద్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ సమస్య లేకుండా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రెండు ఎలివేటెడ్ కారిడార్లను చేపట్టింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ రోడ్(జాతీయ రహదారి44 కలిపేందుకు) వరకు 5.4 కి.మీ ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు (రాజీవ్ రహదారి) 18కి.మీ మరో ఎలివేటెడ్ కారిడార్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వీటికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. అయితే రక్షణ శాఖ నుంచి రావాల్సిన భూములపై నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే పర్యవేక్షిస్తున్నారు. ఏడాదిన్నరలో రెండు ఎలివేటెడ్ కారిడార్లను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా హెచ్ఎండీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

డెయిరీ ఫామ్ కారిడార్ పనులు 45 శాతం

ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్(నేషనల్ హైవే 44) ఎలివేటెడ్ కారిడార్ ను రూ.1,487కోట్లతో 5.4 కిలోమీటర్ల నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కారిడార్ లో 3.095 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది. 600 మీటర్లు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ రన్ వే కింద నుంచి వెళ్తోంది. మొత్తం 3.2 కిలోమీటర్లు మిలటరీ భూముల్లోని వెళ్తోంది. ఈ కారిడార్‌లోని 90 పిల్లర్లకుగాను ఇప్పటికే 22 పిల్లర్లకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. ఆరు పిల్లర్లపై పియర్ క్యాప్స్ పూర్తి చేశారు. 33 గిడ్డర్లను తయారు చేశారు. ఏడాదిన్నరలో ఈ కారిడార్ ను పూర్తిచేయాలని హెచ్ఎండీఏ టార్గెట్‌గా పెట్టుకుందని అధికారులు చెబుతున్నారు.

మిగతాది 2 లో..

# ఆ మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయలేం

- ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో స్పష్టత
- నీళ్లు నింపితే కూలే ప్రమాదం
- 44 గ్రామాలకు ముప్పు హెచ్చరిక
- కాళేశ్వరంపై ఉత్తమ్ తీవ్ర విమర్శలు
- రూ.1.81 లక్షల కోట్ల అప్పుల ఆరోపణ




**న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్):** బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయలేమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ ఆయన సచివాలయంలో వర్షాలు, సన్నద్ధతపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాము కట్టిన బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయడం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారని, కానీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బెస్‌మెంట్లు పనికిరావంటూ ఇప్పటికే ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు ఇచ్చిందన్నారు.

# ఎంఐఎంపై భయమా? ప్రేమనా?


- హైడ్రా చర్యలపై తీవ్ర విమర్శలు
- ఫాతిమా సంస్థల అంశం ప్రస్తావన
- కాంగ్రెస్-ఎంఐఎం కుమ్మక్కు ఆరోపణ
- ఒకే చట్టం అమలు చేయాలన్న డిమాండ్
- ఓటు బ్యాంక్ రాజకీయాలపై విమర్శలు




**న్యూస్ డెస్క్, 05 జూలై బి.యన్.యస్):** ఎంఐఎం ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి సర్కార్ పని చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఎంఐఎం అంటే భయమా? ప్రేమా? లేక రెండునా అని ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ కమిషన్ల కక్కుర్తి కోసమే హైడ్రా పేరుతో పేదల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. సామాన్యులపైనే హైడ్రా చర్యలు తీసుకుంటోందని, మజ్లిస్ నేతలపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన కిషన్ రెడ్డి.. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్, ఫాతిమా విద్యాసంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు.

**రాజకీయ ప్రయోజనం కోసమే కలిసిపోయారు:** హైడ్రా కూల్చివేతల్లో పేద ముస్లింలు కూడా ఇండ్లు, జీవనోపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు.

# హర్మూజ్‌లో కొత్త టోల్ విధానం




- నౌకలకు సేవా రుసుము వసూలు
- ఒమన్‌తో ఇరాన్ కీలక చర్చలు
- మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు
- హర్మూజ్ భద్రతపై ఇరాన్ పట్టు

# పూర్తిగా సంక్షోభం 15న జగన్ భరోసా




- ఫీడ్ ధరల పెంపుపై ఆందోళన
- 15న భీమవరానికి జగన్
- రైతుల సమస్యలు తెలుసుకోనున్న మాజీ సీఎం
- ఫీడ్ ధర తగ్గించాలని డిమాండ్
- ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం

# కాళేశ్వరం తెలంగాణకు వరం




- రూ.400 కోట్లతో మరమ్మతులు సాధ్యం
- మోటర్లు ఆన్ చేయాలన్న డిమాండ్
- వారం రోజులు కేసీఆర్‌కు అప్పగించండి
- ముట్టడిస్తామంటూ కేటీఆర్ హెచ్చరిక

# మెట్రో ఫేజ్-2 ఫైల్ కదలాలి




- కేంద్రమంత్రులకు సీఎం కీలక లేఖ
- ఎస్‌బీఐ క్యాప్స్ జాప్యంపై ఆందోళన
- వ్యయం పెరిగే ప్రమాదం హెచ్చరిక
- రీఫైనాన్సింగ్‌పై త్వరగా నిర్ణయం
- కేంద్రం సహకారం కోరిన సీఎం

**న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్):** హైదరాబాద్ మహానగరం భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మెట్రో విస్తరణ ప్రాజెక్టును వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, మనోహర్ లాల్ ఖట్టర్‌లకు ఆయన ఒక లేఖ రాశారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని ఆ లేఖలో సీఎం విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1 టేకోవర్ (రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విలువల నిర్ధారణ బాధ్యతలను ఎస్బీఐ క్యాప్స్ సంస్థకు అప్పగించాల్సి ఉంది. అయితే, ఎస్బీఐ క్యాప్స్ పరిధిలో జరుగుతున్న జాప్యం కారణంగా మెట్రో ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని సీఎం లేఖలో పేర్కొన్నారు. ఈ ఆలస్యం వల్ల మెట్రో ఫేజ్-2 నిర్మాణ వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# అందుకే అలా మాట్లాడా

## వైటీడీ బోర్డు వివాదంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ




# 70 ఏళ్ల చట్టానికి గుడ్‌బై

## కొత్త అర్బన్ గవర్నెన్స్ బిల్లు

- ప్రజల అభిప్రాయాలకు ప్రభుత్వం ఆహ్వానం
- గ్లోబల్ సిటీ లక్ష్యంగా కొత్త చట్టం
- నెట్ జీరో, పౌర సేవలకు ప్రాధాన్యం
- జూలై 24 వరకు సూచనల స్వీకరణ




# 'స్వర్ణ కుప్పం విజన్-2029' ప్రారంభం




# రాష్ట్రవ్యాప్తంగా మరో లక్ష పింఛన్లు కట్!

- లక్ష మంది అనర్హుల గుర్తింపు
- మృతుల పేర్లపై పెన్షన్ల దందా
- లైఫ్ అథెంటికేషన్‌లో వెలుగుచూసిన నిజాలు
- అక్రమ పెన్షన్లకు ప్రభుత్వం చెక్
- 3 లక్షల మందికి కొత్త పింఛన్లు
- అర్హులకు త్వరలో శుభవార్త

2 లో

# ఆ మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయలేం

మొదటి పేజీ తరువాయి



ఒకవేళ వాటిల్లో నీళ్లు స్టోర్ చేస్తే ఏకంగా బ్యారేజీలే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆ బ్యారేజీలు కూలితే భద్రాచలం సహా మొత్తం 44 గ్రామాలు కొట్టుకుపోతాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, ఒక్క నీటిపారుదల శాఖపైనే రూ.1.81 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత చేస్తే కూలిపోయిన ప్రాజెక్టుగా కాళేశ్వరం మిగిలిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# మెట్రో ఫేజ్-2 ఫైల్ కదలాలి

మొదటి పేజీ తరువాయి


రుణాల రీఫైనాన్సింగ్‌పై త్వరగా నిర్ణయం తీసుకోండి..



మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన రుణాల రీఫైనాన్సింగ్‌పై కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మెట్రో ఫేజ్ – 2 నిధుల సమీకరణ కోసం ఒక సమగ్ర ఆర్థిక ప్రణాళికను రూపొందించాలని ఆయన కేంద్రమంత్రులను కోరారు. హైదరాబాద్ నగర అంతర్జాతీయ స్థాయి రవాణా అవసరాలకు మెట్రో విస్తరణ అత్యంత కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును త్వరగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి లేఖలో స్పష్టం చేశారు.

# హర్మూజ్ జలసంధిలో కొత్త టోల్ విధానం..!

## ఇరాన్ కీలక నిర్ణయం




న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో కొత్త టోల్ విధానాన్ని అమలు చేయడానికి ఇరాన్ చర్యలు చేపడుతోంది. హర్మూజ్ తమ ప్రాదేశిక జలాల్లో భాగంగా ఉన్నందున, అక్కడ ప్రయాణించే నౌకల నుంచి 'సేవా రుసుము' వసూలు చేస్తామని చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మానీ వెల్లడించారు. ఈ విషయంపై ఒమన్‌తో చర్చలు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మిత్రదేశాలకు రాయితీలు..

అంతర్జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. కష్టసమయంలో తమకు సహకరించిన మిత్ర దేశాలకు ఈ సేవా రుసుము విషయంలో ప్రత్యేక ప్రాధాన్యం, రాయితీలు కల్పించనున్నట్లు ఇరాన్ యోచిస్తోంది. హర్మూజ్‌లో ప్రయాణ భద్రత, నౌకల రాకపోకల పర్యవేక్షణ, పర్యావరణ పరిణామాల నియంత్రణ వంటి అంశాలను ఇకపై ఒమన్ సహకారంతో ఇరాన్ చూసుకోనుంది. ఈ జలసంధి ఇతర దేశాలు సైనిక విన్యాసాలు చేపట్టడానికి రంగస్థలం కాదని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాది స్పష్టం చేశారు. మరోవైపు, ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా ఒమన్ తీరం వెంబడి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎనిమిది నౌకలను అధికారులు వెనక్కి పంపినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి.

# ఎంఐఎంపై భయమా? ప్రేమనా?

## రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసిన కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఆ పేద కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు అటు ఎంఐఎం కానీ, ఇటు కాంగ్రెస్ కానీ వారి తరఫున నిలబడలేదని కనీసం నిరసన కూడా తెలపలేదన్నారు. కానీ ఎంఐఎంకు సంబంధించిన ఆస్తుల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ రెండు పార్టీలు కలిసికట్టుగా నిలబడుతున్నాయని దీన్ని బట్టి వారికి ముస్లిం సమాజంపై ప్రేమ కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టమవుతోందని ఆరోపిస్తున్నారు. ఫాతిమా విద్యాసంస్థల ఎపిసోడ్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తే ఎంఐఎం ద్వంద్వ విధానం అనుసరిస్తోందన్నారు. మీ రాజకీయ ప్రయోజనాలకు ప్రజల ఆస్తులు తాకట్టు పెట్టవద్దన్నారు.

ఒకటే న్యాయం ఉండాలి: పేదవాడికి బుల్డోజర్లు.. కాంగ్రెస్–మజ్లిస్ రాజకీయ కూటమికి రక్షణ అన్నట్లుగా ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఉన్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, వనరులు తెలంగాణ ప్రజల సొత్తే కానీ, రాజకీయ రక్షణలో ఉన్న కొందరి సొత్తు కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఓటు బ్యాంక్, మతపరమైన కోణంలో పాలన సాగించడం ఆపి, తమ రాజకీయ మిత్రులను వెనకేసుకురావడం మానుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి 'ఒకే రాజ్యాంగం, ఒకే చట్టం, ఒకే న్యాయం' వర్తింపజేయాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అందుకే అలా మాట్లాడా

## వైటీడీ బోర్డు వివాదంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ



న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): తెలంగాణ కాంగ్రెస్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు చర్చగా మారింది. మంత్రిపదవి ఆశిస్తున్న ఆయన ఇటీవల వ్యవహరిస్తున్న తీరు సొంత పార్టీతో పాటు ప్రత్యర్థి పార్టీలోనూ హాట్ డిస్కషన్ గా మారుతోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటనకు దూమ్మా కొట్టి అందరికీ షాకిచ్చిన రాజగోపాల్ రెడ్డి.. యాదగిరిగుట్ట దేవస్థానం (వైటీడీ) బోర్డు విషయంలో ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలో తాను చేసిన వ్యాఖ్యలపై తాజాగా ఆయన క్లారిటీ ఇచ్చారు.

అందుకే ముక్కుసూటిగా మాట్లాడా: రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు అందరూ పని చేయాలన్నారు. పదవులు ఉన్నా, లేకున్నా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై రాహుల్?తో మాట్లాడానని కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగొద్దనే వైటీడీ బోర్డు విషయంలో ముక్కుసూటిగా మాట్లాడినట్లు చెప్పారు. అయితే యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించి తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేనది రాజగోపాల్ రెడ్డి ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం యాదాద్రి జిల్లాలోనే ఉన్నప్పటికీ తనకు సమాచారం ఇవ్వలేనది ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దారుణం అని మండిపడ్డారు. ఇందుకు సంబంధించి వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయనపై విధంగా స్పందించారు.

# రాష్ట్రవ్యాప్తంగా మరో లక్ష పింఛన్లు కట్!



న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున జరుగుతున్న పెన్షన్ల అక్రమాలను తాజాగా అధికార యంత్రాంగం బట్టబయలు చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం లక్ష మందికి పైగా అనర్హులు అక్రమంగా నెలవారీగా పెన్షన్లను అందుకుంటున్నట్లుగా ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఇందులో కొన్నేళ్ల క్రితమే చనిపోయిన వారి పేరుపై కూడా కొందరు అక్రమార్కులు ఆశతో నెలనెలా డబ్బులు డ్రా చేస్తున్నట్లుగా డ్రా చేస్తున్నట్లు నిఘా వర్గాలు, క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. సాంకేతికత ఆధారంగా చేపట్టిన లైఫ్ అథెంటికేషన్ అంటే బతికే ఉన్నారా లేదా అని నిర్ధారించే ప్రక్రియ ద్వారా దిమ్మతిరిగే నిజాలు వెలుగుచూశాయి. దీంతో తక్షణమే స్పందించిన ప్రభుత్వం చనిపోయిన, అర్హత లేని వారి పేర్లను పెన్షన్ల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

దాదాపు 3 లక్షల మందికి కొత్తగా పెన్షన్..

అయితే, రాష్ట్రంలో పెన్షన్ జాబితా నుంచి అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను వృథా చేయకుండా నిజమైన నిరుపేదలు, అర్హులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను అధికారులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. కాగా, తాజాగా గుర్తించిన లక్ష మంది అనర్హుల స్థానంలో.. మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లను త్వరలోనే మంజూరు చేయనున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి ఆర్థిక శాఖ కూడా కసరత్తు ముమ్మరం చేసింది. దీంతో రాష్ట్రంలో కొత్తగా దాదాపు 3 లక్షల మందికి పెన్షన్ సౌకర్యం లభించనుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏళ్ల తరబడి పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. త్వరలోనే ఈ అర్హుల తుది జాబితాను విడుదల చేసి, కొత్త పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

# ఏడాదిన్నరలో రెండు కారిడార్లు

మొదటి పేజీ తరువాయి

రెండు ర్యాంపులు.. 1.5కి.మీ. ఓపెన్ అండర్‌పాస్..

డెయిరీ ఫామ్ ఎలివేటెడ్ కారిడార్‌లో రెండు ర్యాంపులను ఏర్పాటు చేయడానికి బోయిన్ పల్లి జంక్షన్ దగ్గర రెండు వైపుల రెండు లేన్ల ర్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు బాలానగర్ నుంచి మేడ్చల్ వెళ్లడానికి రెండు వైపుల ర్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు ఈ కారిడార్ లో 1.5 కిలోమీటర్ల ఓపెన్ అండర్ పాస్ ను ఏర్పాటు చేయనున్నారు. టివోలీ, జనరల్ చౌదరి, సికింద్రాబాద్ క్లబ్ జంక్షన్ల వద్ద లోకల్ ట్రాఫిక్ కోసం అండర్ పాస్ పై స్లాబ్ వేయనున్నారు. సుమారు 5మీటర్ల లోతులో ఉన్న అండర్ పాస్ లో నీళ్లు నిలిస్తే ఎప్పటికప్పుడు ఖాళీ చేయడానికి రెండు మోడ్రన్ టెక్నాలజీతో కూడిన భారీ పంపులను ఏర్పాటు చేయనున్నారు.

శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌లో..

ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌లో మూడు ర్యాంపులు, ఒక వెహికిలర్ అండర్ పాస్‌ను ఏర్పాటు చేయనున్నారు. కార్ఖాన, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాలను కారిడార్‌ను ఎక్కడానికి, దిగడానికి ర్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు రూ.4,263కోట్లతో చేపట్టిన 18.14కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు ఆగస్టులో ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే భూసేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ కారిడార్ 9.8 కిలోమీటర్లు రక్షణశాఖకు సంబంధించిన భూముల నుంచి పోతుంది. మరో 450 మీటర్ల వరకు టన్నెల్ మార్గంలో హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ ఎయిర్ పోర్టు నుంచి నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన రక్షణ శాఖ భూములను ఇప్పటికే 40శాతం హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకున్నది. ఆగస్టు వరకు భూసేకరణ పనులను పూర్తిచేయడంతోపాటు కారిడార్ నిర్మాణ పనులను ప్రారంభించినున్నట్టు అధికారులు చెబుతున్నారు.


భూసేకరణపై స్పెషల్ ఫోకస్..

ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులకు సంబంధించిన రక్షణ భూముల సేకరణ అంశాన్ని నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. రెండు కారిడార్లకు సంబంధించి 165.587ఎకరాల రక్షణ భూములకుగాను ఇప్పటికు 91.79 ఎకరాల భూములను హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకున్నది. మరో 73.79ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. దీంతో పాటు రక్షణ శాఖకు సంబంధించి కాంపౌండ్ వాల్స్, ఇతర నిర్మాణాల కోసం ఇప్పటి వరకు రూ.56 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. బాలమ్ రాయ్ దగ్గర కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన సంపు, పంప్ హౌస్ ను మోడ్రన్ టెక్నాలజీతో హెచ్ఎండీఏ నిర్మిస్తోంది. బోయిన్ పల్లిలో కూడా సంపును పూర్తిచేశారు. డెయిరీ ఫామ్ కారిడార్ లో 36 రక్షణ శాఖ నిర్మాణాలకుగాను 29నిర్మాణాల పనులు పురోగతిలో ఉన్నాయి. శామీర్ పేట్ కారిడార్ లో 91నిర్మాణాలకుగాను ఐదింటిని పూర్తి చేశారు. 79పనులు టెండర్ దశలో ఉన్నాయి. మరో 6పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

ప్రీ కాస్టింగ్ విధానంలోనే...

రెండు కారిడార్లకు సంబంధించిన పనులు ప్రీకాస్టింగ్ విధానంలో చేపడుతున్నారు. డెయిరీ ఫామ్ కారిడార్ నిర్మాణ సంస్థ అయితే ఎంవీఆర్ సంస్థ తన కాస్టింగ్ కండ్లకోయలో ఏర్పాటు చేసింది. అక్కడే పియర్ క్యాప్స్ తయారు చేస్తోంది. దీంతోపాటు శామీర్ పేట్ కారిడార్‌కు సంబంధించిన నిర్మాణ సంస్థ బెకెమ్ ఏజెన్సీ హకీంపేట్‌లో కాస్టింగ్ ఏర్పాటు చేసుకుంది. దీంతోపాటు రెండు ఎలివేటెడ్ కారిడార్‌లను పర్యవేక్షించడానికి, క్వాలిటీ చెక్ చేయడానికి ఆర్వీ కన్సల్టెన్సీని నియమించారు. ఎప్పటికప్పుడు చెక్ చేయడానికి మోడ్రన్ టెక్నాలజీతో కూడిన క్వాలిటీ ల్యాబ్ కూడా ఏర్పాటు చేశారు.

# 70 ఏళ్ల చట్టానికి గుడ్‌బై.. సరికొత్త ముసాయిదా బిల్లు




న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగర పట్టణ పాలనలో సరికొత్త విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. సుమారు 70 ఏళ్ల నాటి జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో సరికొత్త అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ భవిష్యత్తు పట్టణ పాలన కోసం 'కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు–2026' ముసాయిదా (డ్రాఫ్ట్)ను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. ఈ అత్యంత కీలకమైన కొత్త బిల్లుపై భాగ్యనగర ప్రజలు, పట్టణ అభివృద్ధి నిపుణుల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను, సలహాలను ఆహ్వానించింది. నగర భవిష్యత్తును మార్చబోయే ఈ చట్టంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో.. జూలై 24, 2026 లోగా ఆన్‌లైన్ ద్వారా కానీ లేదా మున్సిపల్ శాఖకు లిఖితపూర్వకంగా కానీ తమ సూచనలను పంపవచ్చని స్పష్టం చేసింది. 1955లో రూపొందించిన పాత జీహెచ్ఎంసీ చట్టంలోని చాలా నిబంధనలు ప్రస్తుత గ్లోబల్ సిటీ అవసరాలకు సరిపోవడం లేదని, కాలానుగుణత కోల్పోయిన అలాంటి పాత నిబంధనలన్నింటినీ ఈ కొత్త బిల్లు ద్వారా పూర్తిగా తొలగించనున్నారు.

ఆధునిక పట్టణ పాలనను అందించడం, సమగ్ర పౌర సేవలను వేగవంతం చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా నెట్ జీరో కార్బన్ ఉద్గారాల లక్ష్యాలను అందుకోవడం వంటి అంశాలకు ఈ కొత్త బిల్లులో అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. నగరంలో వ్యాపార సౌలభ్యాన్ని (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మరింత పెంపొందించడం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే ధ్యేయంగా ఈ సరికొత్త చట్టాన్ని డిజైన్ చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు వీలుగా రూపొందించిన ఈ ముసాయిదా బిల్లును క్షుణ్ణంగా పరిశీలించి, తగిన సూచనలు చేయాల్సిందిగా నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పౌరసమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేకంగా పిలుపునిచ్చింది.

# 'స్వర్ణ కుప్పం విజన్-2029' ప్రారంభం




న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక అడుగులు వేశారు. 'స్వర్ణ కుప్పం విజన్ 2029' ప్రణాళికపై సింగపూర్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులతో సీఎం తన కుప్పం క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అందుకోసం పక్కా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వర్ణ కుప్పం విజన్ 2029పై తాము ప్రత్యేకంగా రూపొందించిన ప్రాథమిక మాస్టర్ ప్లాన్‌ను సుర్బానా జురాంగ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యంగా కుప్పం ప్రాంతంలోని వ్యవసాయం, టూరిజం (పర్యాటక) రంగాలలో కొత్తగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, అమలు చేయాల్సిన అంతర్జాతీయ స్థాయి ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. కుప్పం నియోజకవర్గానికి ఉన్న ప్రత్యేక భౌగోళిక స్వరూపం, రవాణా సౌకర్యాలు, ఇక్కడి హార్టికల్చర్ ఉత్పత్తులు, పంటల సరళి, అపారమైన పశుసంపదతో పాటు స్థానిక ప్రజల జీవన విధానం, వారి ప్రధాన ఆదాయ వనరుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా సంస్థల ప్రతినిధులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ వనరులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గ రూపురేఖలను మార్చేలా ఒక పటిష్టమైన విజన్ ప్లాన్‌ను త్వరితగతిన రూపొందించాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలో కేవలం మౌలిక వసతుల కల్పనే కాకుండా, ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజల జీవన ప్రమాణాలు (స్టాండర్డ్ ఆఫ్ లివింగ్) ఆర్థికంగా పెంచేందుకు అవసరమైన చర్యలను తమ మాస్టర్ ప్లాన్ లో చేర్చాలని సీఎం కోరారు. స్థానిక యువత, ప్రజలలో నైపుణ్యాభివృద్ధిని పెంచడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రాంతీయంగా అందుబాటులో ఉన్న సహజ వనరులను అత్యంత సమర్థవంతంగా ఉపయోగించుకోవడం వంటి కీలక అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ సంస్థల ప్రతినిధులకు స్పష్టం చేశారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దులకు దగ్గరగా ఉంటూ.. ఎంతో ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన జీవనానికి అనువైన ప్రాంతంగా ఉన్న కుప్పానికి ఉన్న భౌగోళిక అనుకూలతలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం కుప్పం ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ఈ పారిశ్రామిక వృద్ధికి అనుగుణంగా భవిష్యత్తు అవసరాలను తట్టుకునేలా సరికొత్త ప్రాజెక్టులను డిజైన్ చేయాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరారు.

# కాళేశ్వరం తెలంగాణకు వరం

న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన హౌస్ అరెస్టులు, పోలీసుల ఆంక్షలు, అడుగడుగునా ఎదురైన అడ్డంకులను అధిగమించి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు బయలుదేరిన తమను పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడంతో 3 గంటల్లో చేరుకోవాల్సిన ప్రయాణానికి మధ్యాహ్నం 3 గంటల సమయం పట్టిందని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా దగా పడ్డ తెలంగాణకు నీళ్లివ్వాలని కేసీఆర్ మహాయజ్ఞంలా కాళేశ్వరాన్ని నిర్మించారని, తాము ఇక్కడికి ఎవరినో నిందించడానికి లేదా రాజకీయ కక్ష తీర్చుకోవడానికి రాలేదని స్పష్టం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు వరం

బాసర నుండి గోదావరి పారుతున్నా సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎడారిలానే ఉండిపోయిందని, నీళ్ల కోసమే ఆనాడు ఉద్యమం చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. పల్లం నుంచి నీటిని పైకి తేవచ్చని, మనం కూర్చున్న చోట 90 అడుగుల ఎత్తులో నీళ్లు ఉన్నాయని కాళేశ్వరం నిరూపించిందన్నారు. కాంగ్రెస్ నాయకులు గతంలో తుమ్మిడిహట్టి దగ్గర కడతామని ప్రజలను మభ్యపెట్టారని, ఆనాడు మహారాష్ట్రకు 152 మీటర్ల ఎత్తు పెంచవద్దు అని కాంగ్రెస్ ప్రభుత్వమే లేఖ రాసిందని గుర్తుచేశారు. కానీ, కేసీఆర్ జల దౌత్యం జరిపి, మూడున్నరేళ్లలో చర్యలు తీసుకుని, గోదావరిలో ఎప్పుడూ నీళ్లుండేలా కన్నెపల్లి దగ్గర ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించారన్నారు. 22 ఏళ్లయినా పోలవరం పూర్తికాలేదని, కాని కాలంతో పోటీ పడుతూ 80 మీటర్ల నుండి 110 మీటర్ల వరకు నీళ్లు ఎత్తేలా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేశామని చెప్పారు.

రూ. 400 కోట్ల పనులను చేయకుండా రాజకీయం

మొత్తం 141 టీఎంసీల సామర్థ్యం, 370 కి పైగా పిల్లర్లు ఉన్న ఈ భారీ ప్రాజెక్టులో ఒక బ్లాక్‌లో రెండు పిల్లర్లు కుంగితే 'కూలేశ్వరం' అంటూ కాంగ్రెస్ నేతలు కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు పిల్లర్లు కుంగిన ఘటనపై తమకు కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. రెండు పిల్లర్లు కుంగిన బ్లాక్ పునర్నిర్మాణానికి కేవలం రూ. 400 కోట్లు మాత్రమే అవుతుందని, అది కూడా ప్రభుత్వంపై ఒక్క పైసా భారం పడకుండా నిర్మాణ సంస్థే పూర్తి చేస్తానని చెప్పినా ప్రభుత్వం పనులు చేయడం లేదని ఆరోపించారు. రూ. 95 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుందని రేవంత్ రెడ్డి సొంత మామనే ప్రశ్నించినా, ముఖ్యమంత్రికి బుద్ధి రావడం లేదని ఎద్దేవా చేశారు.

చేతకాకపోతే కేసీఆర్‌కు అప్పగించండి.. లేదంటే ముట్టడిస్తాం!

ప్రస్తుతం కాళేశ్వరం దగ్గర 100 మీటర్ల ఎత్తులో నీళ్లు ఉన్నాయని, కన్నెపల్లి నుండి నీళు తీసుకోవడానికి 93 మీటర్లు ఉంటే చాలని, అయినా ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీళ్లు తీసుకోకపోవడం వల్లే హైదరాబాద్‌లో తాగునీటి కొరత ఏర్పడి 15 వేల ట్యాంకర్లు తిరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో పంటలు పండాయని అంటున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, 2014కు ముందు ఎందుకు ఇంత ధాన్యం పండలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలినప్పుడు మీ అవినీతి వల్లే కూలిందని తాము అనలేదా అని ప్రశ్నించారు. రైతులకు నీళ్లిస్తే యూరియా ఇవ్వాలని, ధాన్యం కొని మద్దతు ధర ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయడం లేదన్నారు.


"కాళేశ్వరం ఈ రాష్ట్రానికి కేసీఆర్ ఇచ్చిన వరం.. నీవు (ఉత్తమ్) శనేశ్వరం" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మీకు చేతకాకపోతే మా కేసీఆర్‌కు ఒక్క వారం రోజులు అప్పగించండి.. వారం రోజుల్లో నీళ్లు ఎత్తి చూపిస్తాం" అని సవాల్ విసిరారు. మేడిగడ్డ కాకుండా కన్నెపల్లి నుండి నీళ్లు తీసుకునే అవకాశం ఉన్నా ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని, ఎన్‌డీఎస్ఏ రిపోర్టులకు ఎలాంటి విశ్వసనీయత లేదని కొట్టిపారేశారు. ప్రభుత్వంపై కలిసికట్టుగా ఒత్తిడి తెచ్చి నీళ్లు ఎత్తేలా చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే 50 వేల మందితో ప్రాజెక్టును ముట్టడించి, తామే స్వయంగా మోటర్లను ప్రారంభిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# పూర్తిగా సంక్షోభం.. 15న జగన్ భరోసా



న్యూస్ డెస్క్, 05 జూలై (బి.యన్.యస్): ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. రొయ్యల ఫీడ్ ధరల పెంపుతో ఆక్వా రైతులు అల్లాడిపోతున్నారు. ఫీడ్ ధరలు ఏకంగా రూ. 14 పెంచటంతో లబో దిబోమంటున్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం రూ. 4 తగ్గించాలని ఆదేశించింది. అయితే వ్యాపారులు మాత్రం రూ. 2 తగ్గించారు. దీంతో ఆక్వా రైతులు మరింత ఆందోళన వ్యక్తం చేశారు. రూ.14 పెంచడమేంటని, రూ. 2 తగ్గించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వారైతులను మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కలవనున్నారు. వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపై పోరాటం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ఈ నెల 15న పశ్చిమగోదారి జిల్లా భీమవరంలో పర్యటించనున్నారు. ఎన్నికల హామీ మేరకు ఫీడ్ ధర తగ్గించమని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేయనున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైసీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అధికారికంగా వెల్లడించారు.

# జనసేన పార్టీలో పదవి కోసం దరఖాస్తు చేసుకున్న రిటైర్డ్ కల్నల్ కందునూరు గోపి.




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 05:

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పార్టీ పదవుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కడప నగరం హరిత హోటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు, రిటైర్డ్ కల్నల్ కందునూరు గోపి పార్టీ పదవి కోసం తన దరఖాస్తును సమర్పించారు. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డికి ఆయన దరఖాస్తును అందజేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో మరింత చురుకైన పాత్ర పోషించాలనే సంకల్పంతో ఈ దరఖాస్తు సమర్పించినట్లు కందునూరు గోపి తెలిపారు. పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, జనసేన ఆశయాల సాధనకు నిబద్ధతతో కృషి చేస్తానని, ఈ సందర్భంగా కందునూరు గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జీసి.కృష్ణమూర్తి, గోసిటి రామ గోవిందు, దాసరి రవిశంకర్, భరత్, దండు శ్రావణ్, కర్రె పుల్లయ్య, విశ్వేశ్వరయ్య, దస్తగిరి, శీను తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ భూసేకరణలో అసైన్డ్ భూ యజమానులకు అన్యాయం.?

## భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై05: సోలార్ ప్లాంట్ భూసేకరణలో అసైన్డ్ భూ యజమానులకు తీవ్ర అన్యాయం చేశారని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లె, పాపిరెడ్డి పల్లి, రెవెన్యూ గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ భూ సేకరణలో భారీ అవకతవకలు జరిగాయన్నారు. రైతుల హక్కులను కాలరస్తూ రైతులకు ఇవ్వాల్సిన పరిహారం లో తీవ్ర అన్యాయం చేశారని ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించదని ఆయన స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. భూములు ఇవ్వడానికి ఇష్టపడని రైతులకూ చాలీచాలని పరిహారం ఇవ్వడం బాధాకరమన్నారు. సోలార్ భూముల పరిహారం మంజూరులో తీవ్ర అన్యాయం చేశారని . గత 18 సంవత్సరాలుగా అసైన్ లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారిని పట్టించుకోకుండా వారికి తెలియకుండానే భూమిని అప్పగించడం పేద ప్రజలకు జరిగిన అన్యాయాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. గత అనేక సంవత్సరాలుగా రైతులు స్థానికంగా భూమి సాగు చేసుకుని బోరు బావులు ఏర్పాటుతోపాటు మామిడి, అరటి పంటలు ఉన్న రైతులకు హక్కు లేదనిచెప్పడంపై రైతులు ఆవేదన వ్యక్తం బాధాకరమన్నారు. రైతుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకరిస్తుందని రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చంద్ర ఓబుల్ రెడ్డి స్పష్టం చేశారు.

# బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి..




నల్లగొండ (బీఎన్ఎస్): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఖాజీ రామరం గ్రామంలో ఇద్దరు బాలురు బావిలో పడి అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. గ్రామానికి చెందిన

బోల్లూరి లక్కీ, బొంగరాల మనీ భార్గవ్ లు ఆడుకుంటూ బయటకు వెళ్లి బావిలో శవాలై కనిపించారు.. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలు బయటకు తీయించి, వారి మృతికి గల కారణాలు అన్వేషిస్తున్నారు.. వారిని ఎవరైనా బావిలో పడేశారా.. లేక వాళ్లే పడిపోయారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.. మృతులు

ఇద్దరు చిన్నారులు కావడం తో గ్రామంలో విషాదాం నెలకొంది..

# బ్రిక్స్ సమావేశాల ఏర్పాట్లకు శ్రీకారం

ఈ నెల 14, 15 తేదీల్లో భాగ్యనగర్ లో జరగనున్న బ్రిక్స్ దేశాల సమావేశాల కు సంబంధించి ఏర్పాట్లలో భాగంగా, భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.




సమావేశాల నిర్వహణ వ్యవహారాలను సమన్వయం చేయడానికి ఏర్పాటు చేసిన బ్రిక్స్ సమావేశాల కార్యాలయాన్ని మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. గవర్నర్ శివప్రసాద్ శుక్ల , కేంద్ర కార్మిక శాఖ మంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు, అధికారులు హాజరవుతారని వివరించారు.

కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షులు మల్లేశం , అఖిల భారత సంఘటన మంత్రి సురేంద్రన్ జీ, తెలంగాణ సంఘటన మంత్రి రామ్మోహన్ , రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ , రాష్ట్ర కార్యదర్శి అంజి రెడ్డి , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డి , విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగుడాకుల బాలస్వామి , అలాగే వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభంలో భారతమాత చిత్రపటానికి, దత్తో పంత్ తంగిడే చిత్రపటాలకు పూలమాల సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బ్రిక్స్ సమావేశాల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, సమన్వయం, కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

# స్విస్ ప్రాంగణంలో ఎన్ సి సి క్యాడేట్ల సందడి



హైదరాబాద్, 3 జూలై 2026: శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌కు సీనియర్ సైనిక అధికారి.. లెఫ్టినెంట్ కల్నల్ మంజుల్ శర్మ విచ్చేశారు . ఎన్.సి.సి క్యాడెట్లతో, విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ప్రాంగణం అంతా కలియ తిరుగుతూ ఎన్ సి సి క్యాడేట్లను ఉత్సాహపరిచారు. ఎన్సిసి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియపరిచారు.

ఈ కార్యక్రమం ను పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు సూచన మేరకు ప్రిన్సిపాల్ రమ విశ్వనాథన్ సమన్వయం చేశారు. ఎన్.సి.సి పి.ఐ, వి.వి.ఆర్. చారి, ఎ.ఎన్.ఓ సులోచన వెంట నిలిచారు.

లెఫ్టినెంట్ కల్నల్ మంజుల్ శర్మ మాట్లాడుతూ ... పాఠశాల మౌలిక సదుపాయాలను, క్యాడెట్ల క్రమశిక్షణ, ఉత్సాహాన్ని ప్రశంసించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, అంకితభావం, దృఢనిశ్చయం ప్రాముఖ్యతను వివరించి ప్రోత్సహించారు. యూ.కే.జి చిన్నారులతో సైతం ఆయన సరదాగా గడిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ఎన్ సి సి విభాగం పటిష్టతకు పాఠశాల తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు.

విద్యార్థులు, క్యాడెట్లు.. ఆర్మీ ఆఫీసర్ పర్యటనతో ఎంతో ప్రేరణ పొందారు.

# గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం



నెల్లూరు జిల్లా నెల్లూరు(బి.యన్.యస్):-నెల్లూరు నగరంలోని పురమందిరం టౌన్ హాల్‌లో గిరిజన యానాది విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన యానాది విద్యా ఆణిముత్యాలకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందిస్తూ, విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచి విశిష్ట ఫలితాలు సాధించిన గిరిజన యానాది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు మరియు బహుమతులు అందజేసి అభినందించారు.

# ఎస్పి నచికేత్ ఆదేశాలతో మైదుకూరులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 05:

కడపజిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుఝామున మైదుకూరు పట్టణం పరిధిలోని సర్వాయపల్లి రోడ్డు నందు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు మరియు అనుమానితుల ఇళ్లలో, అనుమానిత ప్రాంతాల్లో వేటకొడవళ్లు, బాంబులు మరియు నిషేధిత ఆయుధాల కొరకు అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో రికార్డులు లేని 28 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు ఇస్తున్నారని రికార్డులు లేని వాహనాలు కొనుగోలు చేయ వద్దని, కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు సూచించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు, రెడ్ శాండల్ స్మగ్లర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులు ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా మీరు,మీ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి లేదా అనుమానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలని సూచించారు. కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లో మైదుకూరు అర్బన్ ఇన్స్పెక్టర్ కె.రమణా రెడ్డి, ఎస్ఐ వెంకట రమణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై రాపూరు పోలీసుల ఆకస్మిక దాడి

నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):-నెల్లూరు జిల్లాలో పేకాట, గ్యాంబ్లింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, రాపూరు పోలీసులు ఈ రోజు రాపూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపూరు పంచాయతీ పరిధిలోని నవాబుపేట గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో ఆదివారం ఆకస్మిక దాడి నిర్వహించారు.



పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు యస్. ఐ. జె.తిరుమల రావు, మరియు పోలీసు సిబ్బంది నిర్వహించిన ఈ దాడిలో 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.19,480/- నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డితో ప్రభుత్వ విప్ నాయకర్ భేటీ

**ప్రభుత్వ విప్ కు ఆత్మీయ ఆహ్వానం**

**పలికిన ఎమ్మెల్యే సోమిరెడ్డి**



నెల్లూరు జిల్లా నెల్లూరు(బి.యన్.యస్):-నెల్లూరు నగరంలోని వేదాయపాళెం కార్యాలయంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే, జనసేన పార్టీ జిల్లా పరిశీలకులు బొమ్మిడి నారాయణ నాయకర్ మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బొమ్మిడి నారాయణ నాయకర్ కు ఆత్మీయ ఆహ్వానం పలికిన అనంతరం

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో పాటు రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.

# భువనగిరి గడ్డపై రాజ్యాధికార సమరభేరి..

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రాజ్యాధికార సమరభేరి' బహిరంగ సభకు భారీ సంఖ్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. సభకు ముందు నిర్వహించిన ఒగ్గుకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బీసీల జీవన పరిస్థితులను ప్రతిబింబించే నాటికలు సభికులను ఆకట్టుకున్నాయి.సభలో పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీలకు రాజకీయ అధికారమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను ఆధిపత్య కులాలు శాసిస్తున్నాయని ఆరోపిస్తూ, ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.తెలంగాణలో బీసీల జనాభా అధికంగా ఉన్నప్పటికీ అధికార పదవులు కొద్ది వర్గాలకే పరిమితమయ్యాయని పేర్కొంటూ, వివిధ గణాంకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభికులకు వివరించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ సందర్భంగా 'సర్జికల్ స్ట్రైక్-59' పేరుతో ప్రత్యేక రాజకీయ కార్యక్రమాన్ని ప్రకటించిన మల్లన్న, రాబోయే ఎన్నికల్లో ఆధిపత్య వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను రాజకీయంగా ఓడించడమే లక్ష్యమని తెలిపారు.అలాగే 2028 నాటికి తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి వస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ సభా వేదికపై కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు.భూముల అంశంపై మాట్లాడుతూ, గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందాల్సిన భూములు అన్యాయంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు.అధికారంలోకి వస్తే ల్యాండ్ సీలింగ్ చట్టంలో అవసరమైన మార్పులు చేసి పేదలకు భూములు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేసిన మల్లన్న, ఉద్యమానికి మేధావులు ముందుకు రావడం శుభపరిణామమన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసిన డాక్టర్ భిక్షపతి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరగా, మాజీ మావోయిస్టు నేత పిట్టల శంకర్ కూడా పార్టీలో చేరారు.సభలో బెల్లి లలిత, మారోజు వీరన్న, కోనపురి సాంబశివుడు, గద్దర్, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి ఉద్యమకారుల సేవలను మల్లన్న స్మరించారు.అమెరికా సహా విదేశాల నుంచి వచ్చిన ఎన్నారైలు కూడా సభకు హాజరై మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.రాయగిరి రైతులకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా వ్యక్తం చేసిన మల్లన్న, రాబోయే ఎన్నికల్లో సామాజిక న్యాయమే ప్రధాన అజెండాగా ప్రజల ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ నివాళి - బెంగాల్ లో బిజెపి గెలుపు

దేశ స్వాతంత్ర్యం తరువాత బెంగాల్ ప్రజలు మళ్లీ అమితానందంతో సంబరాలు చేసుకుంటున్న సంవత్సరమిది. దేశ స్వాతంత్ర్య సమరానికి దిక్సూచిగా నిలిచిన మహనీయులు, జాతీయవాదులు, సామాజిక సంస్కర్తలు, వారి త్యాగం, వారి భావజాలం, వారి మార్గదర్శకత్వాన్ని విదేశీ అరువు భావజాల ఆధారిత ప్రభుత్వాలు కాలక్రమేణా మరుగునపరిచాయి. వారి నిరంకుశ పాలనలను చూసి విసిగివేసారిపోయిన బెంగాల్ ప్రజలు తమ వారసత్వం ఎంత గొప్పదో, దేశ సరిహద్దుల విషయంలో, దేశ సమైక్యతలో తమ బాధ్యత ఎంత కీలకమో గ్రహించారు. గతంలో జరిగిన రాజకీయ పొరపాట్లను సరిదిద్దుకుంటూ జాతీయవాద ప్రధాన స్రవంతిలో కలవాలన్న ఆలోచనను ఓటు రూపంలో ప్రదర్శించిన బెంగాల్ ప్రజల ఆకాంక్షకు ప్రతిరూపమే 2026 బెంగాల్ ఎన్నికల ఫలితం.

1977లో బెంగాల్ ప్రజలు విదేశీ భావజాల ప్రభావంలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. దాదాపు 34 వత్సరాల తర్వాత, 2011లో ఆ పాలన నుంచి బయటపడినా, ప్రత్యామ్నాయంగా ఎంచుకున్న రాజకీయ శక్తులు కూడా భారత జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా, విదేశీ ప్రభావాలకు అనుకూలంగా, దేశ వ్యతిరేక శక్తులకు అండగా నిలుస్తున్నాయనే వాస్తవం ప్రజలకు క్రమంగా అర్థమైంది. ఈ అవగాహన 2026 నాటికి మరింత స్పష్టమైంది. ఫలితంగా, నిద్రాణంగా ఉన్న జాతీయ భావం మేల్కొని, భావజాల మార్పు పట్ల ఆకాంక్ష పెరిగి, భారతీయ జనతా పార్టీ విజయానికి బాట వేసింది.


2026లో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నాయకత్వంలో ఏర్పడిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేవలం ఒక ఎన్నికల విజయంగా మాత్రమే కాకుండా, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి 125వ జయంతి సందర్భంగా ఆయనకు ప్రజలు సమర్పించే గొప్ప నివాళిగా భావించవచ్చు. ఇది కేవలం ఒక ప్రభుత్వ మార్పుగా మాత్రమేకాక డా. శ్యామ ప్రసాద్ జీ జీవితాంతం ప్రతిపాదించిన జాతీయవాద భావజాలానికి లభించిన ప్రజా మద్దతుగా చూడవచ్చు.

భారతదేశ చరిత్రలో అధికార పదవులను దేశసేవకు సాధనంగా భావించిన మహనీయులు కొద్దిమందే ఉన్నారు. అలాంటి మహనీయుల్లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆయనకు రాజకీయాలు అధికారాన్ని అనుభవించడానికి కాదు, దేశాన్ని బలపరచడానికి, భారతీయ సంస్కృతిని కాపాడడానికి, జాతీయ సమైక్యతను నిలబెట్టడానికి ఒక సాధనంగా కనిపించాయి.

డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ 1901 జూలై 6న కలకత్తాలో ఒక విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. తండ్రి "బెంగాల్ టైగర్"గా ప్రసిద్ధి పొందిన కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆశుతోష్ ముఖర్జీ. తల్లి జోగమాయా దేవి. కలకత్తాలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తి చేసిన ఆయన, అనంతరం కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రుడయ్యారు. అనంతరం న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. ఉన్నత విద్య కోసం ఆయన ఇంగ్లండ్ వెళ్లి న్యాయశాస్త్రంలో శిక్షణ పొంది బారిస్టర్‌గా అర్హత సాధించారు. కేవలం 33 సంవత్సరాల వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టారు.

1947 ఆగస్టు 15న దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ఏర్పడిన కేంద్ర మంత్రివర్గంలో హిందూ మహాసభ ప్రతినిధిగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ పరిశ్రమలు మరియు పౌర సరఫరాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలం పాటు ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ, క్రమంగా జవహర్‌లాల్ నెహ్రూ దేశ సమగ్రతకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా నెహ్రూ హిందుత్వం పట్ల వ్యతిరేకత, జమ్మూ--కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ దొంగదారిలో ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో చొప్పించడంపై ఆయనకు తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. దేశం అంతా ఒకటే అయినప్పుడు ఒక రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక జెండా, ప్రత్యేక నిబంధనలు ఉండటం భారత సమైక్యతకు భంగం కలిగిస్తుందని ఆయన భావించారు.

ఆయన దృష్టిలో బెంగాల్ రాజకీయంగా మాత్రమే కాదు, దేశ భద్రత పరంగా కూడా అత్యంత కీలకమైన రాష్ట్రం. సరిహద్దు భద్రత, అక్రమ చొరబాట్లు, జనాభా సమతుల్యత, జాతీయ సమైక్యత వంటి అంశాలపై ఆయన పలుమార్లు హెచ్చరికలు చేశారు. అదే సమయంలో తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్)లో హిందువులపై జరుగుతున్న దాడులు, వారి భద్రతపై కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానంపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటి నేపథ్యంలో తన పదవి కంటే దేశ



ప్రయోజనాలే ముఖ్యమని భావించిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ అధికారాన్ని వదులుకోవడం వ్యక్తిగతంగా తనకు నష్టం అయినా, దేశ ప్రయోజనం ముందు తన పదవికి విలువ లేదనే ఆలోచనతో 1950లో కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేసి ప్రజా ఉద్యమ మార్గాన్ని ఎంచుకున్నారు. అది ఆయనలోని మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

రాజీనామా తరువాత దేశవ్యాప్తంగా "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే ఆయన నినాదం కేవలం రాజకీయ నినాదం మాత్రమే కాదు. భారత సమైక్యతపై ఆయనకు ఉన్న అచంచల విశ్వాసానికి ప్రతీక. దేశం భౌగోళికంగా మాత్రమే కాదు, భావజాలపరంగా కూడా ఏకంగా ఉండాలని ఆయన విశ్వసించారు. ప్రాంతాలు వేరైనా, భాషలు వేరైనా, సంప్రదాయాలు వేరైనా, భారతీయత ఒక్కటే హిందుత్వమే మన అందరినీ కలిపే బంధమని ఆయన ప్రకటించారు. జాతీయవాద భావజాలాన్ని రాజకీయంగా సంఘటితం చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించి, భారతదేశం కేవలం భౌగోళిక సరిహద్దులతో ఏర్పడిన దేశం కాదని, వేల సంవత్సరాల సాంస్కృతిక వారసత్వంతో నిర్మితమైన నాగరికత అని ఆయన విశ్వసించారు.

ఈ భావజాలానికి రాజకీయ వేదికగా 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. భారతీయ జనసంఘ్ స్థాపనతో భారత రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. దేశభక్తి, జాతీయ సమైక్యత, సాంస్కృతిక జాతీయవాదం, స్వదేశీ ఆర్థిక దృక్పథం వంటి అంశాలను ప్రధాన సిద్ధాంతాలుగా ఆ పార్టీ ప్రకటించింది. అప్పటి రాజకీయ వాతావరణంలో ఈ భావజాలం పెద్దగా ఆదరణ పొందకపోయినా, శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోలేదు. ఆ కాలంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత బలమైన రాజకీయ శక్తిగా ఉంది. జనసంఘ్ వంటి కొత్త పార్టీకి పెద్దగా అవకాశాలు లేవని అనేక మంది భావించారు. అయినప్పటికీ, దేశంలో బలమైన జాతీయవాద ప్రత్యామ్నాయం తప్పనిసరిగా ఎదుగుతుందని శ్యామ ప్రసాద్ ముఖర్జీ విశ్వసించారు.

జనసంఘ్ ఆవిర్భావాన్ని విమర్శిస్తూ, ఎదుగుదలను అప్పటి కాంగ్రెస్ నాయకత్వం అనేక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా అప్పటి ప్రధాని నెహ్రూ "దేశంలో జనసంఘ్‌ని అనగదొక్కుతాను" అని అసహనాన్ని ప్రకటించినప్పటికీ, వ్యక్తిగత విమర్శలకు స్పందించకుండా శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన రాజకీయ పోరాటాన్ని కొనసాగించారు. తనకు వ్యతిరేకంగా ఎన్ని విమర్శలు వచ్చినా, దేశ సమైక్యత, భారతీయ సంస్కృతి, జాతీయ భద్రత వంటి అంశాలపై రాజీ పడకూడదనే దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. "కాశ్మీర్ భారతదేశానికి అంతర్భాగం" అనే సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటేందుకు ఆయన అహర్నిశలు కృషి చేశారు.

1953లో కాశ్మీర్ ప్రవేశానికి అనుమతి పత్రం (ౠవతీఎఖ) తీసుకోవాలని నెహ్రూ ప్రభుత్వం నిబంధన విధించింది. భారతదేశ పౌరుడిగా భారతదేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లడానికి తనకు అనుమతి అవసరం లేదని డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రకటించారు. ఆ నమ్మకంతోనే ఆయన అనుమతి పత్రం లేకుండా జమ్మూ--కాశ్మీర్‌లో ప్రవేశించారు. ఆ వెంటనే ఆయనను అరెస్టు చేసి శ్రీనగర్‌లో నిర్బంధించారు. నిర్బంధంలో ఉన్న సమయంలో ఆయన ఆరోగ్యం క్షీణించింది. 1953 జూన్ 23న, తన 52వ జన్మదినానికి కొద్ది రోజుల ముందే అనుమానాస్పద స్థితిలో శ్రీనగర్‌లో ఆయన మరణించారు. తల్లి జోగమాయా దేవి, కుటుంబ సభ్యులు, అనుచరులు, పలు రాజకీయ నాయకులు కూడా డా. ముఖర్జీ మరణంపై సమగ్ర స్వతంత్ర విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మరణంపై అప్పటి నుంచి ఇప్పటికీ అనేక ప్రశ్నలు సమాధానం లేకుండానే మిగిలిపోయాయి.

1953 జూన్ 23న డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ భౌతికంగా ఈ లోకాన్ని విడిచిపోయినా, ఆయన ప్రతిపాదించిన జాతీయవాద భావజాలం అంతరించిపోలేదు. ఒక నాయకుడిని కోల్పోయిన బాధ దేశభక్తులలో ఉన్నప్పటికీ, ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించాలనే సంకల్పం మరింత బలపడింది. వ్యక్తి కన్నా సిద్ధాంతం గొప్పదని, పదవి కన్నా దేశం గొప్పదని ఆయన జీవితమే భారతీయ జనసంఘ్ కార్యకర్తలకు శాశ్వత సందేశంగా నిలిచింది.

డా. ముఖర్జీ స్థాపించిన భారతీయ జనసంఘ్ ప్రారంభంలో పరిమిత రాజకీయ శక్తిగానే కనిపించింది. కానీ దాని పునాదిలో ఉన్న జాతీయవాదం, సాంస్కృతిక చైతన్యం, అఖండ భారత భావన, స్వదేశీ ఆర్థిక దృక్పథం వంటి అంశాలు క్రమంగా ప్రజల్లో ఆదరణ పొందసాగాయి. ఆయన తరువాత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ వంటి నాయకులు ఆ భావజాలాన్ని దేశమంతటా విస్తరించారు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఒకసారి "ఈ దేశ భవిష్యత్తు భారతీయ సంస్కృతిని ఆధారంగా చేసుకున్న జాతీయ చైతన్యంపైనే ఆధారపడి ఉంటుంది" అనే భావాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. రాజకీయ అధికారం మారవచ్చు, ప్రభుత్వాలు రావచ్చు, వెళ్లిపోవచ్చు; కానీ దేశ ఆత్మ అయిన భారతీయతను కాపాడే రాజకీయ శక్తి అవసరమని ఆయన విశ్వసించారు.

1977లో అత్యవసర పరిస్థితి అనంతరం జనసంఘ్ ఇతర పార్టీలతో కలిసి జనతా పార్టీలో విలీనమైంది. అయితే భావజాల భేదాల కారణంగా 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడింది. ఆ పార్టీ తన సిద్ధాంత మూలాలను భారతీయ జనసంఘ్ నుంచే స్వీకరించింది. అందువల్ల డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీని భారతీయ జనతా పార్టీ తన భావజాల పితామహుడిగా గౌరవిస్తుంది. ప్రారంభ సంవత్సరాల్లో బీజేపీకి పెద్దగా రాజకీయ విజయాలు లభించలేదు. అయినప్పటికీ, కార్యకర్తలు సిద్ధాంతాన్ని వదలకుండా ప్రజల్లో పనిచేశారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేశారు. "అధికారం కోసం కాదు -- దేశం కోసం" అనే భావనతో పార్టీ విస్తరణ కొనసాగింది.

1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో తొలిసారిగా బీజేపీ కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జాతీయ రహదారుల నిర్మాణం, పోఖ్రాన్ అణు పరీక్షలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యలతో భారతదేశాన్ని కొత్త దిశలో నడిపించే ప్రయత్నం చేసింది. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లభించింది. అనంతరం 2019లో మరింత భారీ ప్రజా మద్దతుతో రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఈ కాలంలో తీసుకున్న కొన్ని ప్రధాన నిర్ణయాలను డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రతిపాదించిన భావజాలానికి కొనసాగింపుగా భావించవచ్చు. వాటిలో ముఖ్యంగా జమ్మూ--కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 నిబంధనల రద్దు, మతపరమైన హింసకు గురైన కొన్ని పొరుగు దేశాల మైనారిటీలకు రక్షణ కల్పించే చర్యగా పౌరసత్వ సవరణ చట్టం (జూూూ), అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణం, సరిహద్దు భద్రతకు ప్రాధాన్యం, స్వదేశీ రక్షణ సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యలను డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలకు, జాతీయవాద దృక్పథానికి అనుగుణమైన నిర్ణయాలుగా చూడవచ్చు.

బెంగాల్ రాజకీయాలను పరిశీలించినప్పుడు కూడా ఈ భావజాల పోరాటం స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు భారత జాతీయ చైతన్యానికి కేంద్రంగా నిలిచిన బెంగాల్‌లో మళ్లీ జాతీయవాద ఆలోచనలు బలపడటం, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వారసత్వంపై చర్చ పెరగడం, ఆయన జన్మభూమిలో ఆయన ఆశయాల గురించి ప్రజల్లో అవగాహన విస్తరించడం గమనించదగిన పరిణామాలు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ రాజకీయ జీవితం మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. సిద్ధాంతం కోసం త్యాగం చేసిన నాయకులు కాలాన్ని జయిస్తారు. అధికారం తాత్కాలికం కావచ్చు, కానీ దేశం కోసం చేసిన త్యాగం శాశ్వతం.

నేడు ఆయన 125వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలు కేవలం ఒక నాయకుడి జయంతి వేడుకలు మాత్రమే కాదు. భారతీయత, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్యం, సాంస్కృతిక గౌరవం వంటి విలువలను మరోసారి స్మరించుకునే సందర్భం. బెంగాల్ నేలపై జాతీయవాద చైతన్యం మరింత బలపడాలని, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలవాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఆయన జీవితం నిత్యస్ఫూర్తిగా నిలుస్తుంది.

వ్యాసకర్త :
**ఎన్ మధుకర్ జీ,**
ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి